

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

# వార్త


## పోలీసు వాహనాలను సమకూర్చిన మంత్రి ఆనం



**నెల్లూరు, జూన్ 8, ప్రభాత వార్త-వైద్యం** ఆనం వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పోలీసు స్టేష న్లకు దాతల సహకారంతో సమకూర్చిన 6 వాహనాలను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కు అందజేసిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా వ్యాప్తంగా కంటి వైద్య పరీక్షలు

- ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 మంది దివ్యాంగులకు ట్రైసైకిల్స్ అందజేత
- వెల్లడించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త-వైద్యం** వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంల త్వరలో జిల్లా వ్యాప్తంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. ప్రతి గ్రామానికి వైద్యులను పంపి కంటి పరీక్షలు చేయిస్తామన్నారు. అవసరం అయిన వారికి ఆపరేషన్స్ కూడా చేయించే బాధ్యత తీసుకుంటున్నామని వివరించార. ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం పది మంది దివ్యాంగులకు వీపీఆర్ నివాసంలో ట్రై సైకిల్స్ అందజేశారు. ట్రై సైకిల్స్ అందుకున్న వారిలో అనంతసాగరం, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, జలదంకి, నెల్లూరు సిటీ, రూరల్ మండలాలకు చెందిన దివ్యాంగులు ఉన్నారు. ట్రైసైకిల్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులను ఆదుకుంటున్నామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఎంత మంది దివ్యాంగులు ఉన్నా ప్రతి ఒక్కరికి ట్రై సైకిల్ ఇస్తామన్నారు. ఎవరైనా మిస్ అయి ఉంటే తప్పకుండా తమను సంప్రదించాలని తెలిపారు. అలాగే ట్రైసైకిల్స్ తీసుకున్న వారిలో ఎవరికైనా ఇబ్బందులు వస్తే తమను సంప్రదించాలని, మెయింటెనెన్స్ కూడా ఫౌండేషన్ తరుపున చేస్తున్నామన్నారు. కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

### చికిత్స పొందుతూ మహిళ మృతి



**ఉదయగిరి, జూన్ 8, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి ట్యాంక్ బండ్ వద్ద శనివారం ప్రమాదవశాత్తు ఓ మహిళ ట్రాన్స్‌ఫారం వద్ద కరెంట్ షాక్‌కు గురైన విషయం తెలిసిందే. ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మరువక ముందే అదే ప్రాంతంలో ఓ శునకం సైతం ట్రాన్స్‌ఫారంకు తగిలి చనిపోయింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై పట్టణ వాసులు మండిపడుతున్నారు.

## ఖజానా శాఖలో ఒక వర్గానికి సంబంధించి అనుకూలంగా బదిలీలు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 8, ప్రభాతవార్త** ఏపిటిఎస్ఎ బైలా ప్రకారం మూడు నెలలకు ఒకసారి ఇ.సి. మీటింగ్ సంవత్సరానికి ఒకసారి జనరల్ బాడీ మీటింగ్ పెట్టాలి అన్న విషయాన్ని గాలికి వదిలేసి గత ఆరు సంవత్సరాల నుంచి సభ్యుల నుంచి కనీసం సభ్యత్వం కూడా వసూలు చేయకుండా పేరు మాత్రం నేను రాష్ట్ర అధ్యక్షుడు అని చెబుతూ, ఖజానా శాఖ ప్రాముఖ్యతను నిర్వీర్యం చేసిన ఘనుడుకు ఆ సంఘం రద్దు అవుతుంది అన్న విషయం మరిచి రోసా రూల్స్‌ను అతిక్రమించి నియంతృత్వ దోరణిలో కొన్ని జిల్లాలకు ఎన్నికలు జరిపి, కొన్ని జిల్లాలకు జరపకుండా రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు తే 25.05.2025 దిన విజయవాడలో జరిగి, జిల్లాలో ఏపిటిఎస్ఎ ఉద్యోగులకు బదిలీలు జరుగకుండా ఆపడానికి మాత్రమే తేది. 25.05.2025 దిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరుపుచున్నారు. మరీ ముఖ్యంగా ఏపిటిఎస్ఎ బైలా ప్రకారం మూడు సంవత్సరాలుకు ఒకసారి ఎన్నికలు జరుపకుండా వుంటే ఆ సంఘం తిరిగి జి.ఐ.డి. గవర్నమెంటు వారి దగ్గర మరలా పర్మిషన్ తీసుకొని (జి.ఓ.) ప్రకారం, ఏపిటిఎస్ఎ సంఘం గుర్తింపు పొందాలి. అలా కాని పక్షంలో ఆ సంఘమునకు గుర్తింపు మినహాయింపు ఎలా వుంటుంది తెలియ జేయాలి. నెల్లూరు సంఘంనకు తే. 02.02.2025 దిన ఎన్నికలు జరిగినాయి. కొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు. తిరిగి తే 22.05.2025 దిన బదిలీ మినహాయింపు కొరకు తిరిగి సభ్యులను ఎన్ను కొన్నారు. ముఖ్యంగా సంఘాలవారు ప్రమోషన్ మీద వెళ్ళినవారు స్థానంలో మరియు మరణించిన సభ్యుల స్థానంలో కోఆప్షన్‌గా సభ్యులుగా తీసుకొంటారు. ఇలా విరుద్ధంగా కేవలం ఉద్యోగుల ట్రాన్స్ఫర్ కోసం తీసుకొన్నారు. అలా చేయాలని ఏమన్నా ఏపిటిఎస్ఎ బైలాలో వుందో తెలియజేయాలన్నారు.

## ఎప్‌సెట్‌లో సత్తా చాటిన నారాయణ విద్యార్థులు



**నెల్లూరు. జూన్8 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర సాంకేతిక విద్యామండలి ఆదివారం విడుదల చేసిన ఎప్‌సెట్ పరిక్షా ఫలితాల్లో నగరంలోని స్థానిక నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు అత్యంత ప్రతిభకనపరిచి సత్తా చా టారు. రాష్ట్ర స్థాయిలో 1,2,5,7,10 సాధించి జయకే తనం ఎగురవేశారు. స్థానిక కళాశా లలో విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతు ఎప్‌సె ట్ పరీక్షల్లో తమ ఐఐటి అకాడమి విద్యార్థులు పూర్వజ్ 84 వ ర్యాంకు, హేమంత్‌సాయి 90వ ర్యాంకు, కే.అ శ్రిత్ 105వ ర్యాంకు, మధుకిరన్135వ ర్యాంకలను సాధించటం జరిగిందన్నారు. 100లోపు ర్యాంకులను ఇద్దరు, 500లోపు 8 మంది,1000 లోపు 11మంది, 5000 లోపు 1038మంది, రాష్ట్ర ర్యాంకులను సాధించాన్నారు. తమ విద్యార్థులు ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన అందరికి ఆయన దన్యవాదాలు తెలిపారు. అనంతరం ర్యాం కులు సాధించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డీన్స్, కోర్ డీన్స్, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

## పేద పిల్లలకు డిజిటల్ విద్యను అందించడమే నా డ్రీమ్

### మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త -వైద్యం** నిరుపేదలు తమ బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించే క్రమంలో వారు పడుతున్న ఇబ్బందులను దగ్గర్నుంచి చూశాను కాబట్టే.. ప్రతి స్టూడెంట్‌కి నాణ్యమైన విద్యను అందించాలని వీఆర్ హైస్కూల్‌ని తీర్చిదిద్దుతున్నానని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. పేద పిల్లల కోసం సిద్ధమవుతున్న వీఆర్ హైస్కూల్‌ను చూసేందుకు మంత్రితో పాటు పలువురు టీడీపీ మహిళలు వచ్చారు. ప్లేగ్రౌండ్‌లో ఉన్న ఎక్విప్‌మెంట్స్‌ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీఆర్ హైస్కూల్ రూపురేఖల్ని మంత్రి మార్చేశారు అంటూ అభినందనలు తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన వీఆర్ హైస్కూల్‌లో తన విద్యాభ్యాసం జరిగిందని ఆయన గుర్తు చేసుకున్నారు. ఎంతో మందిని ఉన్నత శిఖరాలకు చేర్చిన వీఆర్ హైస్కూల్‌ను గత ప్రభుత్వం మూసేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని మరో వారం రోజుల్లో అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. కుమార్తె షరిణి ఈ బాధ్యతలు చూసుకుంటున్నారని ఆయన మీడియాకు తెలిపారు. చదువులతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు చాలా అవసరం అని అందుకే ప్లేగ్రౌండ్‌ని కూడా సుందరంగా తీర్చిదిద్దామని వివరించారు. తన కుమార్తె షరణి 20 నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుంటుందని వెల్లడించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ కార్తీక్, కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నగర అధ్యక్షులు మామిడాలమధు, మాజీ జడ్పీటీసీవిజేతారెడ్డి, డివిజన్ల ఇన్‌ఛార్జ్‌లు, టీడీపీమహిళలు పాల్గొన్నారు.

# జిల్లాను సస్యశ్యామలం చేసిన నేత ఆనం వెంకటరెడ్డి



- ఆనం కుటుంబంతో ప్రత్యేక అనుబంధం
- సమైక్యవాదాన్ని ఆనాడే వినిపించిన వెంకటరెడ్డి
- జిల్లా ప్రజల హృదయాల్లో ఎప్పటికి నిలిచిపోయిన నేత




**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు జిల్లాను సస్యశ్యామలం చేసిన ఘనత ప్రజా నాయకులు, అందరికి ఆప్తులు ఆనం వెంకటరెడ్డికే చెందుతుందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరు రామలింగాపురం సర్కిల్‌లో ఆనం వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. సింహపురిసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రహ పున:ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, గూడూరు ఎమ్మెల్యే పాశంసునీల్‌కుమార్, జిల్లాపరిషత్‌చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ** ఆనం వెంకటరెడ్డి విగ్రహావిష్కరణకు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఎంపీ వేమిరెడ్డి గుర్తు చేసుకున్నారు. 2008లో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారని,ఆ కార్యక్రమంలో తాను కూడా భాగం అయ్యానన్నారు. అనంతరం ఫ్లైఓవర్ నిర్మాణం నేపధ్యంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తామంతా ఆప్యాయంగా పిలుచుకునే వెంకుబాబు విగ్రహావిష్కరణ చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. మా కుటుంబానికి మా తండ్రి శివకోటారెడ్డితో ఆనం వెంకటరెడ్డికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. వీఆర్ కళాశాలను అభివృద్ధి చేయడంలో వెంకుబాబు ఎంతో చొరువ చూపారన్నారు. జిల్లాను సస్యశ్యామలం చేస్తూ సోమశిల ప్రాజెక్టు దగ్గరి నుంచి ఉదయగిరిలో గండిపాలెం ప్రాజెక్టు, రాళ్లపాడు వంటి ప్రాజెక్టులను తీసుకువచ్చారన్నారు. నెల్లూరు నియోజకవర్గం నుంచి 1972లో ఎమ్మెల్యేగా ఎన్నికై అనేక ఉన్నత పదవులు అధిరోహించాలని గుర్తు చేశారు. జిల్లా సహకార బ్యాంకు సభ్యులుగా, నెల్లూరు మున్సిపల్ చైర్మన్‌గా విశేష సేవలు అందించారన్నారు. పీవీనరసింహారావు జలగం వెంగళరావు వంటి ముఖ్యమంత్రుల కేబినెట్‌లో కీలక పాత్రపోషించారని,1973లో హోంమంత్రిగా 1974 నుంచి 1978వరకు నీటిపారుదలశాఖ మంత్రిగా పని చేశారన్నారు. 1975లో నాటి సీఎం జలగం వెంగళరావుతో సోమశీల ప్రాజెక్టు శంకుస్థాపన, ఉదయగిరి నియోజకవర్గ ప్రజల కోసం గండిపాలెం ప్రాజెక్టు వంటివి తీసుకువచ్చారని చెప్పారు. 1972లో జై ఆంధ్ర ఉద్యమంలో ఉద్యమకారులు.. వెంకటరెడ్డిపైదాడి చేసి జై ఆంధ్రఅనాలని డిమాండ్ చేస్తే.. ఆయన సమైక్యాంధ్ర అని నినాదాలు చేశారని, రాష్ట్రం విడిపోకూడదని అప్పట్లోనే ఆయన భావించారన్నారు.1983లో అన్న ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే వెంకటరెడ్డిని ఆత్మకూరు, రామనారాయణరెడ్డిని నెల్లూరు అభ్యర్థులుగా పోటీ చేయించి గెలిపించారని వివరించారు. ఆనం వెంకటరెడ్డి వారసులుగా ఆనంవివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి సేవలు అందించారు. ప్రస్తు తం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సమర్ధవంతంగా పని చేస్తున్నారు. ఆనం వెంకటరెడ్డి ఆశయాలకు అనుగుణంగా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సహకారంతో ఎంపీగా తాను కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడతూ**



మహోన్నత వ్యక్తి ఆనం వెంకటరెడ్డి గురించి ఎంత చెప్పిన తక్కువేనన్నారు. పేదల అభ్యున్నతికి పాటు పడిన గొప్ప మనిషి ఆనం వెంకటరెడ్డి అని కొనియాడారు. జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాజకీయ ప్రస్థానం ప్రా రంభించారని గుర్తు చేసుకున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రూపశిల్పి ఆనం వెంకటరెడ్డి జ్ఞప్తికి తెచ్చుకు న్నారు. వీఆర్ కళాశాల అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి ఆనం వెంకటరెడ్డి కుటుంబం అన్నారు. ఇరిగే షన్ మంత్రిగా నీటి ప్రాజెక్టులు తెచ్చి జిల్లా రైతులకు ఎనలేని మేలు చేశారని తెలిపారు. ఆనం కుటుంబం నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేస్తుందన్నారు. అయితే ఇప్పుడు కొంత మంది తొడలు చురుస్తూ విలువలులేని రాజకీ యాలు చేస్తు న్నారని ఎద్దేవ చేశారు. హరనాథపురంలో ఆనం కుటుంబం ఏర్పాటు చేసిన స్కూ ల్‌లో తాను మొదట చదివానన్నా రు. ఆతర్వాత ఆనం కుటుంబ ఆధ్వర్యంలోని వీఆర్సీ హైస్కూల్లో చది వానని తెలిపారు. తనకు మొ దటి ఉద్యోగం వీఆర్సీలో ఇచ్చింది ఆనం భక్తవత్సలరెడ్డి అని గుర్తుకు తెచ్చుకున్నారు. ఆనం కుటుంబంలో తనకు ఎన లేని అనుబంధం ఉందని తెలిపారు.

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ**



నెల్లూరు జిల్లా రాజకీయ ముఖ చిత్రంలో ఆనం వెంకటరెడ్డిది చెరపలేని ముద్ర అన్నారు. మహామహులతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న గొప్ప వ్యక్తి అని వ్యాఖ్యానించారు. ఏసీ సుబ్బారెడ్డి తమ్ముడిగా కాక శిష్యుడిగా పనిచేశారని తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చి రాజకీయాల్లో ఎదిగిన కుటుంబం తమదన్నారు. ఏసీ సుబ్బారెడ్డి హయాంలోనే రోడ్ల సౌకర్యం వచ్చిందని గుర్తు చేశారు. అన్ని పార్టీల నేతలతో సఖ్యత కలిగిన ఏకైక వ్యక్తి ఆనం వెంకటరెడ్డి అని కొనియాడారు. అందువల్లే తమకు కూడా అంతటి సఖ్యత ఉండదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆనం వెంకటరెడ్డిది ప్రత్యేక శైలి అని అభినందించారు. సూమస్యల పరిష్కారం కోసం కందుకూరు ప్రాంతం నుంచి కూడా ఎడ్ల బండ్లపై వచ్చే వాళ్ళమని గుర్తు చేశారు. నాలుగు తరాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్నామన్నారు. మా పెద్దనాన్న ఏసీ సుబ్బారెడ్డి, తండ్రి వెంకటరెడ్డిల అడుగుజాడల్లో ప్రస్తుతం తాము రాజకీయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజాసేవే ఆనం కుటుంబ లక్ష్యమన్నారు.

అనంతరం మంత్రి పొంగూరు నారాయణ ఆనం వెంకటరెడ్డి జీవిత చరిత్రకు సంబంధించి పుస్తకాన్ని ఆవిష్కరించిన తొలిప్రతిని ఎంపీకి అందించారు. ఆత్మకూరు నియోజకవర్గ పోలీసు విభాగానికి ఆత్మకూరుకు చెందిన పలువురు దాతలు సమకూర్చిన ఆరు వాహనాలను ఎస్పీ కృష్ణకాంత్‌కి అందించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఎన్డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేతలు వేమిరెడ్డివిజయభాస్క ర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, బీజేపీ నేత దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కర్నాటిఆంజనేయరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, కమ్యూనిస్టు పార్టీ నేత మాదాలవెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ మాదాసుగంగాధర్, ఆనం సోదరులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సోమవారం జిల్లా అంతటా యోగా ర్యాలీలు

- నెల్లూరు చిల్డ్రన్ పార్క్ వద్ద జిల్లా స్థాయి ర్యాలీ
- జిల్లా కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ ఆదేశం



**నెల్లూరు కలెక్టరేట్, జూన్8, ప్రభాతవార్త** సోమవారం (9 వ తేదీ)ఉదయం ప్రతి మండల, గ్రామ ,వార్డు సచివాలయాల స్థాయిలో యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ ఆదేశించారు. ఆదివారం ఆయన జిల్లా అధికారులు, ఎంపీడీవోలు ,మున్సిపల్ కమిషనర్లతో యోగాంధ్ర ర్యాలీ నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరు చిల్డ్రన్ పార్క్ వద్ద ఉదయం 7.30కు జిల్లా స్థాయిర్యాలీ నిర్వహించాలని ర్యాలీలో ఆసక్తి కలి గిన ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, అలాగే జిల్లా అధికారులు సిబ్బంది అందరూ హాజరు కావాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో, వార్డు సచి వాలయం స్థాయిలో కూడా యోగాంధ్ర బ్యానర్ తో ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. స్థానిక ప్రజల ను, ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని కోరారు. 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో నిర్దేశించిన ప్రదేశంలో జరిగే యోగాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంక్షిస్తూ ర్యాలీ నిర్వహించాలన్నారు. జిల్లా, నియోజక వర్గ విజన్ ప్లాన్‌ను రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, స్థానిక శాసన సభ్యులు, కమిటీ సభ్యులు అందరూ హాజరు కావాలని, నియోజక వర్గవిజన్ ప్లాన్, పి4 పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 10వ తేదీ ఉదయం 7 గంటలనుండి 8గంటల వరకు ఉదయగిరిలో మెగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

# కావలిలో కేక పుట్టించిన ప్రముఖ రియల్టర్ మహేంద్రయాదవ్




## టిడిపికి మద్దతిచ్చి ఫ్లెక్సీలమయం చేసిన జనిగర్ల



**కావలి, జూన్8 ప్రభాతవార్త** కావలి వైసిపిలో ప్రధానభూమిక పోషించిన ప్రముఖ రియల్టర్ జనిగర్ల మహేంద్రయాదవ్ వైసిపికి రాంరాం చెప్పి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పంచన చేరి టిడిపికి మద్దతిచ్చి అభివృద్ధికి పాటుపడేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం టిడిపిలో చేరేందుకు కొంతమంది వైసిపి నేతలతో సిద్ధమయ్యారు. కొన్ని అనివార్య కారణాలవల్ల మహేంద్రయాదవ్ ఏర్పాటుచేసిన కార్యక్రమం ఆత్మీయసమావేశంగా మారింది. టిడిపిలో చేరుతున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటికి, టిడిపి అగ్రనేతలతో ఫ్లెక్సీలతో ముంచెత్తారు. కావలి ట్రంకురోడ్డులో భారీ కటౌట్లు ఏర్పాటుచేశారు. ఒక్కసారిగా కావలిలో రియల్టర్ మహేంద్రయాదవ్ ఫ్లెక్సీలతో కేక పుట్టించారన్న ప్రచారం చర్చనీ యాంశమైంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ ర్యాలీని మహేంద్ర చేపట్టారు. స్థానిక పాతవూరు కృష్ణుడి బొమ్మవద్ద నుంచి వేలాదిమందితో ఊరేగింపుగా కళ్యాణమండపం వరకు సాగింది. మహేంద్రయాదవ్ జిందాబాద్.. ఎమ్మెల్యే దగుమాటి జిందాబాద్ అన్న నినాదాల హోరులో ఔట్లు పేల్చి ప్రత్యేకతను చాటిచెప్పారు. దాదాపు వేలాదిమంది జనంతో మన్నెం గోపాలకృష్ణారెడ్డి కళ్యాణమండపం కిక్కిరిసిపోయింది. అశేషజనవాహిని మధ్య రియల్టర్ మహేంద్రయాదవ్ టిడిపికి బహిరంగంగా మద్దతిచ్చారు. టిడిపి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి నాయకత్వంలో పయనిస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. ఏడాది పాలనలో ఆయన చేసిన అభివృద్ధి తనను టిడిపి పార్టీవైపు పయనింపచేసిందన్నారు. కావలి పట్టణ డివైడర్లు, ఫ్లెక్సీలతో టిడిపి జెండాలతో హోరెత్తింది. కావలి పట్టణం మరోసారి పసుపుమయమైంది. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని గజమాలతో సత్కరించి రాఘవేంద్ర స్వామి ప్రతిమను రియల్టర్ జనిగర్ల మహేంద్ర అందచేశారు.

## మెప్మా, ఆంధ్ర ప్రదేశ్ విశిష్ట సేవలకు 9 ప్రతిష్ఠాత్మక స్కాచ్ ప్లాటినం అవార్డులు

**నెల్లూరు సిటీ, జూన్ 8, ప్రభాతవార్త :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలోని పురపాలకశాఖ విభాగం అయిన మెప్మా శాఖకు దేశంలోని ప్రతిష్టాత్మక 9 స్కాచ్ ప్లాటినం అవార్డులు ప్రకటించింది. పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం, పట్టణ పేదరిక నివారణలో చేసిన అసాధారణ కృషి, వినూత్న కార్యక్రమాలు గాను ప్రతిష్మాత్మకమైన స్కాచ్ ప్లాటినం అవార్డును అందుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పట్టణ సముదాయాల్లో ధ్రువీకరితమైన మార్పును తీసుకొచ్చిన మెప్మా యొక్క వినూత్న, ప్రభావవంతమైన కార్యక్రమాలను ఈ గౌరవం గుర్తించింది. ఇవి ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచాయి. భారతదేశంలో అత్యంత స్వతంత్ర సత్కార గౌరవంగా పరిగణించబడే స్కాచ్ ప్లాటినం అవార్డు, పట్టణ సముదాయాల సాధికారత, పేదరిక నిర్మూలన కోసం మెప్మా చేపట్టిన స్థిరమైన, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఉన్న అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. మెప్మా సమర్పించిన 14 ప్రాజెక్టుల్లో 9 ప్రాజెక్టులు బహుళ దశల గరిష్ఠ స్క్రూటినీ ప్రక్రియను విజయవంతంగా దాటి ఈ ప్రతిష్మాత్మక అవార్డును పొందాయి. 9 స్కాచ్ అవార్డుల నివాసం: వెబ్, ఫోన్ ఆధారిత సేవల ద్వారా పట్టణ నిరాశ్రయులకు సురక్షితమైన నివాస వసతి కల్పన మెరుగైన సేవల కల్పన, లైవ్లీహుడ్ ట్రాకర్: జీవనోపాధుల పర్యవేక్షణ కోసం సాంకేతికత వినియోగం ద్వారా సత్వర ప్రగతి నిరంతర సమాచారం, బ్యాంక్ లింకేజ్ స్కీమ్: స్వయం సహాయ సంఘాలను బ్యాంక్ లింకేజి ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం, ఎంపవరింగ్ ఎస్‌హెచ్‌జి ఉమెన్ త్రో ఈ - కామర్స్: ఎస్‌హెచ్‌జి మహిళల ఉత్పత్తులకు ఆన్‌డిసి, నాన్ ఆన్‌డిసి ప్లాట్ఫారం ద్వారా ఆన్లైన్లో మార్కెట్ అవకాశాలు కల్పించడం, ఎంపవరింగ్ అర్బన్ ఎస్‌హెచ్‌జిఎస్ వయా స్కిల్ అండ్ జిగ్ ఎకనామీ. ఎస్‌హెచ్‌జిస్ గిగ్ ఎకానమీతో అనుసంధానించడం ద్వారా నైపుణ్య అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఎస్‌హెచ్‌జి లెడ్ ఎంటర్‌ప్రైజర్స్ అండ్ అర్బన్ జాబ్ క్రియేషన్. ఎస్‌హెచ్‌జి వ్యవసాయ రంగంలో భాగస్వాములుగా మార్చడం. ప్రేరణ సఖీలు ఆదర్శంగా నిలిచిన ఎస్‌హెచ్‌జి మహిళా ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించడం, స్ట్రీట్ వెండర్స్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం: వెండర్ కనెక్ట్ యాప్ ద్వారా వీధి విక్రేతల జీవనోపాధి మరియు సంక్షేమానికి మద్దతు, బలహీన వృత్తుల సంఘటనం: వల్నరబుల్ వృత్తుల్లో ఉన్న కార్మికులను సంఘటితం చేసి సాధికారత కల్పించడం. ఈ సందర్భంగా మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్ తేజ్ భరత్ మాట్లాడుతూ ఈ విజయాన్ని సాధించడంలో సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి పొంగూరు నారాయణ మార్గదర్శకాలు; ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేశ్ కుమార్, ముఖ్యమంత్రి సెక్రటరీ అయిన ప్రద్యుమ్న సమయానుకూల సూచనలు స్ఫూర్తి కారణం అని చెప్పారు. అలాగే ఉత్తేజపూరిత మెప్మా సిబ్బంది పట్టణ స్వయం సహాయక సంఘాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు మెప్మా యొక్క పట్టణ పేదరిక నిర్మూలన దిశగా సాగుతున్న సంకల్పాన్ని మరింత బలపరుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ స్కాచ్ ప్లాటినం అవార్డు ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచింది. పట్టణ అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వినూత్న మార్గాలను ఇది దేశానికి చాటిచెప్పింది. స్కాచ్ ప్లాటినం అవార్డు ప్రదానోత్సవం 2025 సెప్టెంబర్ 20న న్యూఢిల్లీలో జరిగే స్కాచ్ సమ్మిట్లో గ్రాండ్ స్థాయిలో నిర్వహించబడుతుందని తెలియజేసారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట శంకుస్థాపన



**విడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త :** మండలంలోని దంపూరు పంచాయతీ దళిత కాలనీ ఆవరణంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ప్రతిష్ట శంకుస్థాపన టిడిపి మండల ఇంచార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోవూరు మార్కెటింగ్ మాజీ చైర్మన్ పుండ్ల అచ్యుత రెడ్డి, మండల అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, ఐ టిడిపి కార్యదర్శి సత్యవోలు సత్యం రెడ్డి, డిసి చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ ఇ నగంటి సురేందర్ రెడ్డి, దూది విజయ రాఘవన్, పంచమూర్తి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**కొడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త :** మండలంలో ప్రజలకు అందించాల్సిన రేషన్ సరుకులను దుకాణ నిర్వాహకులు తప్పనిసరిగా ప్రజలకు అందజేయాలని స్థానిక తహసీల్దార్ కె స్ఫూర్తి రెడ్డి పలుమార్లు డీలర్లకు సమావేశం ఏర్పాటు చేసి తెలిపినట్లు ఆమె తెలియజేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులను పక్కదారికి వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటాం, అవినీతికి పాల్పడుతున్న డీలర్ల పై సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతినెల జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి సూచనలు సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. (ప్రభాతవార్త) ఫోన్ లైన్ ద్వారా తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డిని వివరణ కోరగా ఎవరైనా సరే ప్రభుత్వం అందజేసే రేషన్ సరుకులను పక్కదార పట్టిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

## మహంకాళి రూపంలో అంకమ్మ తల్లి



**విడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త:** విడవలూరు గ్రామ దేవత గావలసియున్న శ్రీ అంకమ్మ తల్లి కి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన అత్యంత వైభవంగా అర్చకులు కొర్నగిరిచే నిర్వహించారు. రాత్రి పూల అలంకరణ, పలక సేవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## 18న చెన్నకేశవ ఆంజనేయ స్వామి దేవస్థాన సంపూర్ణ జీర్ణో ద్దారణ వార్షికోత్సవం



**బిట్రగుంట జూన్ 8 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన బోగోలు లోని శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానము సంపూర్ణ జీర్ణో ద్దారణ అనంతర 20 వ వార్షికోత్సవం ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ బచ్చు. కృష్ణకుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ పూజా కార్యక్ర మాలతో పాటు, కల్యాణ మహోత్సవ కార్యక్రమం కూడా నిర్వహించడం జరుగుతుంది అని పేర్కొన్నారు. దాతల సహకారం తో నిర్వహించే ఈ కార్యక్రమాలలో ఆసక్తి కల్గిన వారు పాల్గొని దేవుని కృపకు పాత్రులు కాగలరని కోరుతున్నారు.

## కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి





**వింజమూరు, జూన్ 8, ప్రభాతవార్త :** వింజమూరు పట్టణంలోని వైఆర్ జూనియర్ కళాశాలలో ఎన్ఆర్ఐ శేగు సతీష్ దాతృత్వంతో జూన్6వ తేదీ నుండి నిర్వహిస్తున్న శంకర నేత్రాలయం చెన్నై వారి ఉచిత కంటి వైద్యశిబిరంను సద్వినియోగం చేసుకోవాలని యల్లాల రఘురామిరెడ్డి కోరారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ శిబిరంలో 353 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 70 మందికి కంటిలోని శుక్లాలను తొలగించే దానికి శస్త్ర చికిత్సలు అవసరమని డాక్టర్లు గుర్తించడం జరిగింది. వీరికి ఈనెల 10వ తేదీ నుండి చెన్నై నుండి వచ్చే శంకర నేత్రాలయం యొక్క ప్రముఖ డాక్టర్ల చేత వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో మొబైల్ వాహన థియేటర్లలో అధునాతన పరికరాలను ఉపయోగించి శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుంది. ఈనెల 13వ తేదీ వరకు అవసరమైన వారికి కంటి పరీక్షలు చేయటం జరుగుతుందని, అదే విధంగా 14వ తేదీ వరకు శస్త్రచికిత్సలు చేస్తారని ఈ సదవకాశాన్ని ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

## ఈకెవైసి కి ఈనెల 30వరకే గడువు

**బిట్రగుంట జూన్ 8 ప్రభాతవార్త :** బోగోలు మండలంలో ఆధార్ అప్డేట్ చేసుకొని ఇంకను రేషన్ షాప్ లో ఈపాస్ లో ముద్ర వేయని వారు ఈ నెల 30 వ తేది లోగా ఆప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్ మలిశెట్టి సురేష్ కుమార్ తెలిపారు. ఇప్పటికే ఈ గడువు కేంద్ర ప్రభుత్వం పలుమార్లు పొడిగించారని కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ సంక్షేమ పథకాలు పొందాలంటే ఈకెవైసీ తప్పనిసరి అని గుర్తుంచుకోవాలన్నారు. రేషన్ డీలర్లు కూడ ఈకెవైసీ పైన అవగాహన కల్గించాలని ఆదేశించారు.

## జలదంకిలో ఉచిత కంటివైద్య శిబిరం



**జలదంకి, జూన్8, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన జలదంకిలో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరనలో జరిగిన ఈశిభిరానికి విశేష స్పందన కనిపించింది. ఉదయంనుంచి మద్యాహ్నం వరకు చేపట్టిన శిభిరానికి మండలంలోని పలు గ్రామాలనుంచి రోగులు తరలి వచ్చారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద్ నేత్రాలయం సీనియర్ వైద్యులు మేఘన ఆద్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 175మంది రోగులను పరీక్షించి 80మందికి అవసరమైన మందులను అందజేశారు. అలాగే 45మంది కంటి అద్దాలు అందించారు. మరో 35మందికి ఆపరేషన్లు అవసరమని వారిని తిరుపతికి తరలించారు. ఈసందర్బంగ మేనేజింగ్ ట్రస్టి చాగణం గౌరిశంకర్ సిఇఒ సీతారాంనాయుడులు మాట్లాడుతు ఈఉచిత శిభిరాలను కంటి సమస్యలతో బాదపడే వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎఒ కృష్ణగల్లా, నేత్రాలయ సిబ్బంది జీవన్, స్థానిక సిపిఎం నేత రావి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై చర్యలు తీసుకోండి



**వరికుంటపాడు, జూన్8, ప్రభాతవార్త:** ఆంధ్ర రాష్ట్ర రాజదాని అమరావతిపై అక్కడ నివశించే మహిళలను కించపరుస్తు అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ఛానల్ ప్రతినిదులు, సీనియర్ జర్నలిస్ట్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలంటు వరికుంటపాడు మండల తెలుగుదేశంపార్టి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో టిడిపి మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు ఆద్వర్యంలో టిడిపి మహిళా నాయకులు ఎస్ఐ రఘునాద్‌కు ఫిర్యాదుచేశారు. రెండ్రోజులక్రితం వన మహోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతిని దేవతల రాజదానిగ పేర్కొనడంపై జీర్ణించుకోలేని వైకాపా నాయకులు సాక్షి చానల్ కౌంటర్‌గ డిబేట్ నిర్వహించడం అందులో పాల్గొన్న సాక్షి ప్రతినిది కొమ్మినేని శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు అమరావతి దేవతల రాజదాని కాదు అంటు వైశ్యల రాజదానిగ అభివర్ణించడం ఎయిడ్స్ పేశంట్లు వున్న ప్రాంతమని వక్రీకరించి వ్యాఖ్యానించడం తగదంటు వారిపై వెంటనే కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని మహిళలను కించపరచే విదంగ మాట్లాడిన వారిపై పరువునష్టం దావ వేసేందుకు తాము వెనుకాడబోమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈసందర్బంగ చంద్రా మధుసూదన్‌రావు మాట్లాడుతు తెలుగువారి గౌరవాన్ని పోగొట్టేల వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వరికుంటపాడు టిడిపి గ్రామకమిటి అద్యక్షుడుపొద మాధవరావు, మండల ప్రధానకార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్, శాంతికుమారి, భాగ్యమ్మ, వెంగళ్‌రావు, రవి, బాలచంద్ర, మధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగాభవాని అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



**వరికుంటపాడు, జూన్8, ప్రభాతవార్త:** మండలంలోని వేంపాడు పంచాయతి పరిధిలో వేంగమాంబపురం గ్రామంలోవున్న శ్రీగంగాభవాని అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమైనాయి. తొలిరోజు నిలుపు, కుంభబలి, జలాదిస్నానం కార్యక్రమాలతో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగ నిర్వహిం చారు. ఈకార్యక్రమాలన్ని గ్రామానికి చెందిన ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రెండవరోజైన సోమవారం ముద్దలపోలు రాయభారం, జమ్మిమాను పొంగళ్ళు, అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశ విదేశాలలో స్థిరపడిన ఆగ్రామానికి చెందిన వారు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగ అలంకరించారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ముత్తుకూరు, జూన్ 8, ప్రభాతవార్త :** ఉల్లాసంగా.. ఉత్సాహంగా 1987 - 1988 పదవ తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం ముత్తుకూరు ఈదూరు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో పాఠశాలలో అలనాటి తీపి గుర్తులు, గురువుల విద్యా బోధన ప్రస్తుత జీవన విధానంపై ఒకరికి ఒకరు పరిచయం చేసుకున్నారు. అలనాటి గురువులు మస్తానయ్య, సారాబాయ్, చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డిలను ఘన సన్మానం నిర్వహించారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆర్గనైజర్లుగా కరణాల హరిబాబు, చౌక చర్ల సురేష్ రెడ్డి, షేక్ మస్తాన్, మాచిరెడ్డి శ్రీధరరెడ్డి, మహ్మద్ ఫయాజ్, దినేష్‌లు వ్యవహరించారు.

## పొదలకూరులో అట్టహాసంగా హనుమాన్ శోభాయాత్ర



**పొదలకూరు, జూన్ 8, ప్రభాతవార్త :** పొదలకూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అట్టహాసంగా సాగింది. రాంనగర్ గేట్ సెంటర్ నుండి ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్ర పంచాయతీ బస్టాండ్ మీదుగా నెల్లూరు రోడ్ లోని కెఆర్ఆర్ కాలనీ వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రకు స్వాగతం పలుకుతూ హిందూ బంధువులు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జైశ్రీరామ్.. జై జై శ్రీరామ్, జై హనుమాన్.. జై జై హనుమాన్ నినాదాలతో పట్టణమంతా మారు మ్రోగింది. వైభవంగా జరిగిన ఈ హనుమాన్ శోభాయాత్రలలో హనుమంతుడు, శ్రీరాముని విగ్రహాలు ఆకర్షణగా నిలిచాయి. పార్టీలకతీతంగా నిర్వహించిన ఈ శోభాయాత్రలో హిందూ సోదరులు భారీ సంఖ్యలో పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. అలాగే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుండి శివకుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సోదరులు హైస్కూల్ గౌండ్ వద్దకు ర్యాలీగా అధిక సంఖ్యలో తరలివచ్చారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొదలకూరు ఎస్ ఐ హనీఫ్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సచివాలయాల పరిధిలో యోగాంధ్ర ర్యాలీ నేడు



**కోవూరు, జూన్ 8 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ కార్యక్రమాన్ని తప్పక నిర్వహించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే కోవూరు మండలంలోని అన్ని సచివాలయాల్లో యోగాపై ఆ సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు శిక్షణ, అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మండలంలో ఉన్న అన్ని సచివాలయాల పరిధిలో యోగాంధ్రపై ర్యాలీ కార్యక్రమాన్ని తప్పక నిర్వహించాలని, ఈ మేరకు ఆయా సచివాలయాల కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు.

## ఘనంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 8 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం కార్యక్రమాలను రుత్వికులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమాలనికి ఉభయకర్తలుగా కోలేటి రామకృష్ణ, సుజాత కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ ోఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి చేవూరి కృష్ణప్రసాద్, రుత్వికులు కృష్ణస్వామి, సుబ్బయ్య స్వామి, మురళి స్వామి, నిరంజన్ స్వామి, నిర్మాణ కర్తలు మొలకల శ్రీనివాసులురెడ్డి, పోలుదాసు హరి, గాదిరాజు చక్రవర్తి భక్తులు ఉన్నారు.

## కోవూరు ఎస్సైకు ఫిర్యాదు చేసిన మహిళా నేతలు



**కోవూరు, జూన్ 8 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల ప్రకారం ఆదివారం కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్‌కు మహిళా నేతలు, సీనియర్ పార్టీ నేతలు కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. స్త్రీ మూర్తులను అవమాన రీతిలో మాట్లాడిన ఆ చానెల్ ప్రతినిధులను వెంటనే అరెస్టు చేయాలని ఈ సందర్భంగా వారు ఎస్సైను కోరారు. ఈ విధమైన అనుచిత వ్యాఖ్యలు చేసిన వారి పట్ల తక్షణమే ఉన్నతాదికారులు తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. వేగూరు సర్పంచ్ కె. అమరావతి, మాజీ ఎంపీపీలు వెంకట రమణమ్మ, ఉమా, మాజీ సర్పంచ్‌లు చెంచమ్మ, వనమ్మ, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు కె. సుధాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు చెంబేటి పెంచలయ్య, గాదిరాజు సుధాకర్, వేమిరెడ్డి హరికుమార్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, డి. శ్రీనివాసులు నాయుడు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, నాగరాజు సాయిరెడ్డి, శ్రీనివాసులు, బెల్లకొండ విజయ్, కరేటి శ్రీనివాసులు, కూటమి నేతలు అల్తాఫ్,, చక్రవర్తి, పెద్ద సంఖ్యలో మహిళా నేతలు ఉన్నారు.

## వికసిత్ కృషి సంకల్ప అభియాన్



**కొడవలూరు, జూన్ 8, ప్రభాతవార్త:** కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో కొడవలూరు మండలంలోని రామన్నపాలెం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వరి పంట సాగులో రైతాంగం పాటించాల్సిన మెలకువలు గురించి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు తెలియజేయటం జరిగింది. భారతీయ వరి పరిశోధనా స్థానం, మృత్తిక శాత్ర విభాగ శాస్త్రవేత్త, డా. డి. వి. కె. నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతులు ఖచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, సహజ సిద్ధమైన ఎరువులు వినియోగించి పంటలు సాగు చేయాలన్నారు. దీని వల్ల భూమి ఆరోగ్యవంతంగా ఉండటంతో పాటు ఆరోగ్యకరమైన ఉత్పత్తులు ప్రజలకి అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డా. పి. మధుసూదన్, శాస్త్రవేత, తెగుళ్ల శాస్త్ర విభాగం, వ్యవసాయ పరిశోధన స్థానం, నెల్లూరు, మాట్లాడుతూ మొక్కల్లో రోగ లక్షణాలను గుర్తించి దానికి అనుగుణంగా తగిన మందులను సరైన మోతాదులో ఉదయం, సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలని, ఇలా చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారిని, సి. హెచ్. ఎస్. శ్రీలక్ష్మి వరి పంటలో కలుపు, పురుగుల, తెగుళ్ల పద్ధతులు వివరించారు. నీటి యాజమాన్యం విషయంలో తగిన జగ్రత్తలు తీసుకుంటే పిలకలు సకాలంలో వచ్చి దిగుబడి బాగా వస్తుందని. నాట్లు వేసిన నాటి నుండి 20 రోజుల పాటు పొలంలో తగిన సాగునీరు ఉండాలన్నారు. అదేవిధంగా పంట పొలాల్లో మోతాదులో సాగునీరు ఉంటే సుడి దోమ, లద్దె పురుగుల తాకిడి ఉన్నదన్నారు. పొలాల్లో తడి ఆరిపోతే కలుపు మొక్కలు ఎక్కువగా వస్తాయని, రసాయన ఎరువులు వేసేటప్పుడు పొలంలో నీళ్ల తక్కువగా ఉండాలని వారు తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు శాస్త్రవేత్త డా. కె. కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జీవన ఎరువులు వాడుకొని రసాయన ఎరువుల మోతాదు 25 శాతం తగ్గించుకోవాలని సూచించారు. సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతను వివరిస్తూ రసాయన ఎరువుల వాడకం వల్ల జరిగే అనర్థాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి. ఏ. ఏ. ఆర్. నీహారిక, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అడవి పేరంటాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ఉదయగిరి, జూన్ 8, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గన్నేపల్లి పంచాయతీలో వెలసి శ్రీఅడవి పేరంటాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ఆదివారం మొదలుకొని వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు గణపతి పూజ పుణ్యాహ వచనం కలస పూజ రక్షబంధన పూజలతో పాటు విశేష అభిషేకాలు అలంకరణలు చేశారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలు ఐదు రోజులు పాటు జరుగుతాయని గురువారంతో ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## సంగం ఎర్రచెరువు వద్ద రోడ్డు ప్రమాదం ఒకరికి గాయాలు- ఒకరు మృతి



**సంగం జూన్ 8 ప్రభాతవార్త :** సంగం ఎర్రచెరువు సమీపంలో ఆర్చి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బైకు గేదెలను ఢీకున్న సంఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. గాయాలు అయిన వారు ఇద్దరు చెన్నవరపాడుకు చెందిన ముత్యాల కోటయ్య, పేట శివరామయ్య. గాయాలైన వారిని 108 వాహనంలో నెల్లూరులో వైద్యశాలకు తరలించడం జరిగింది. నెల్లూరులో వైద్యశాలలో చికిత్స పొందుతున్న చెన్నవరపాడుకు చెందిన కోటయ్య మృతి చెందినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రంధాలయంలో వేసవివిజ్ఞానశిబిరం ముగింపుసభ



**ఆత్మకూరు, జూన్8 ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని శాఖా గ్రంధాలయంలో ఆదివారం లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వేసవివిజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అతిధులుగా స్థానిక మేధా ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ టి.సి.వి. సుబ్బయ్య, విశ్రాంత గ్రంధబాంధాగారి ఏ.గోవిందరెడ్డిలు హాజరయ్యారు. వేసవిసెలవుల్లో విద్యార్థులు ఎక్కడా ఎండల్లో తిరగకుండా ఈ విజ్ఞానశిబిరంలో పాల్గొని పుస్తకపఠనం, ఆటపాటలు, వివిద పోటీలతో తగు విజ్ఞనం పొందేలా ప్రతిఏటాలాగే ఈదఫా కూడా లైబ్రేరియన్ శ్రీనివాసరాజు శిబిరాన్ని నిర్వహించగారు. ఈసందర్బంగా విద్యార్థులకు స్టోరీటెల్లింగ్, పేపర్‌క్రాఫ్ట్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిధులచేతులమీదుగా బహుమతిప్రదానం గావించారు. ఈ వేసవివిజ్ఞానశిబిర నిర్వహణకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శ్రీనివాసరాజు కృతజ్ఞతలు తెలిపారు.













# ప్రతిభా అవార్డులకు ఎన్‌ఎల్‌ఎఫ్ విద్యార్థులు



**కోవూరు, జూన్ 8 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా 2025 సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కోవూరులోని కోనమ్మతోటలో ఉన్న న్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు చెందినఎం. దివ్యతేజ 592 జె. శ్రీహర శృతి 584, మార్కులు సాధించారు. ఈ మేరకు వీరిరువురు ప్రతిభా అవార్డులకు ఎంపిక కావడంతో సోమవారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డు అందుకోబోతున్నారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ వై. నందకిషోర్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డులకు ఎంపికై తమ పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారన్నారు. విద్యార్థులు ఇరువురిని పాఠశాల డైరెక్టర్ వై. అనిత్ ప్రత్యేకంగా అభినందించారు.

## పంచాయతీల విభజన.. ఆర్థిక సంస్కరణ



**– ఆదాయం జనాభా ఆధారంగా ప్రక్షాళన**

**కోవూరు, జూన్ 8 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న ప్రధాన లక్ష్యంతో పంచాయతీల ప్రక్షాళనకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో క్లస్టర్ విధానాన్ని అమలు చేసేవారు.. అందులో మూడు నాలుగు పంచాయతీలు ఉండే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న జనాభా ప్రాతిపదికన వార్షికంగా వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని పంచాయతీల గ్రేడ్‌లను మార్పు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కోవూరు మండలంలోని మండల పరిషత్ అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. పూర్తయిన వాటిని తుది ప్రతిపాదనలు పంపేందుకు దస్త్రం సిద్ధం చేసింది. గతంలో ఐదు గ్రేడ్‌లు ఉండగా.. తాజాగా ప్రత్యేక శ్రేణితో పాటు నాలుగు విభాగాలకే పరిమితం చేయాలని అధికారులు భావిస్తున్నారు. గతంలో మూడు నాలుగు క్లస్టర్లు ఉన్నా కొన్ని చోట్ల ఇన్‌చార్జిల పాలనే కొనసాగడం.. సంబంధిత ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. ఫలితంగా పాలనాపరమైన ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇటువంటి పరిస్థితుల్లో పంచాయతీలను గ్రేడ్‌లుగా విభజించేందుకు ప్రభుత్వం వ్యవస్థల్లో మార్పులు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ కారణంగా ప్రతి పంచాయతీకి తప్పనిసరిగా ఒక అధికారి ఉండడమే కాకుండా పాలన కూడా మెరుగయ్యే పరిస్థితి ఉంటుంది. గ్రామ పంచాయతీల్లో 10 వేలకు పైగా జనాభాతో పాటు ప్రతి సంవత్సరం కోటి రూపాయలు వార్షిక ఆదాయం ఉంటే వాటిని స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తారు. గ్రేడ్-1లో నాలుగు నుంచి పది వేలు జనాభా ఉన్నా .. 50 నుంచి కోఠి రూపాయలు లోపల ఆదాయం ఉండాలి. గ్రేడ్-2లో 4 ఏలు జనాభా, గ్రేడ్-3లో 2 వేలు లోపు జనాభా ఉండాలి. ప్రస్తుతానికి కోవూరు మండలంలో కోవూరు, పడుగుపాడు పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా గుర్తించారు. అదేవిధంగా ఇనమడుగు, వేగూరు, పోతిరెడ్డిపాలెం, లేగుంటపాడు పంచాయతీలను గ్రేడ్-1 పంచాయతీలుగా, పాటూరు గ్రేడ్-2 పంచాయతీగా గంగవరం , చెర్లోపాలెం , మోడేగుంట గ్రేడ్-4 పంచాయతీలుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం పంచాయతీల విభజన ఆదాయం జనాభా ఆధారంగా దస్త్రం సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత మాత్రమే వీటిని అమలు చేయడం జరుగుతుందన్నారు.

## "ఐలవ్ బుచ్చిరెడ్డిపాలెం"



### పవన్ కృషి అభినందనీయం

**బుచ్చి జూన్ 8 ప్రభాతవార్త :** డిగ్రీ వరకు చదుకొని.. ఉద్యోగం రాలేదని నిరాశ చెందకుండా. స్వచ్చందంగా పైకురావాలని స్వగ్రామం పేరుతో ఇన్‌స్టాగ్రా మ్‌లో "ఐలవ్ బుచ్చిరెడ్డిపాళెం" అని ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజిని క్రియేట్ చేశాడు. ఉసా పవన్‌కుమార్. లక్షమంది పాలోవర్స్‌ని సంపాదించు కున్నాడు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలో తెలుగుదేశం నాయకులు టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు ,ఎం.వి శేషయ్య మోర్ల మురళీ, బత్తల హరికృష్ణా ,దొడ్ల కోదండరామిరెడ్డి పలువురు ప్రముఖులు డిఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లో వేదికపైన జరిగిన కార్యక్రమంలో పవన్‌ని అభినందించారు. స్వగ్రామం అయిన బుచ్చిరెడ్డిపాళెం పేరు పెట్టుకొని లక్షమంది పాలోవర్స్‌ని సంపాదించుకోవడం అభినందనీయమని అన్నారు. పవన్ మరిన్నె ఉన్నత శిఖరాలు అదిరోహించాలని వారు పేర్కున్నారు .ఈ సందర్బంగా కేకున్ కట్ చేసి ముఖ్య అతిధులు పవన్‌కి తినిపించారు. ఈ సందర్బంగా పవన్ మాట్లాడుతు మా ఆత్మీయులు కెవి కిషోర్, గూడరు లోకేష్‌కి, కార్యక్రమానికి విచ్చేసిన అతిధులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు శ్రీకాంత్, దుగ్గిశెట్టి హరినాద్, పొన్నపోలు సుమన్, తదతరులు పాల్గొన్నారు.

## జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే



- నెల్లూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించిన తెలుగు మహిళలు
- అమరావతిని వైశ్యల రాజధానిగా అభివర్ణించడంపై మహిళల మండిపాటు
- నల్లచీరలు ధరించి కథం తొక్కిన మహిళామణులు
- సాక్షి పేపర్‌ను, టీవీని బ్యాన్ చేయాలంటూ డిమాండ్

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – వైద్యం :**అమరావతిని వైశ్యల రాజధానిగా అభివర్ణించటంపై తెలుగు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోని గాంధీ బొమ్మ నుంచి వీఆర్సీ వరకు తెలుగు మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. నల్లచీరలు ధరించి కదం తొక్కిన మహిళామణులు ముందుకు నడిచారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతినేలా సాక్షిని ప్రోత్సహిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలంటూ వారంతా డిమాండ్ చేశారు. ఖబర్ధార్ జగన్ అంటూ నినాదాలతో మహిళామణులు నిరసనలు హోరెత్తించారు. అనంతరం తప్పుడు రాతలు రాసిన సాక్షిపై, తప్పుడు కూతలు కూసిన జర్నలిస్టు కృష్ణంరాజు, డిబేట్ నడిపిన కొమ్మినేనిపై చర్యలు తీసుకో వాలంటూ నెల్లూరు వన్‌టౌన్ పీఎస్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర టీడీపీ మహిళా అధ్యక్షురాలు రేవతి మాట్లాడుతూ మహిళలను కించపరిచేలా వ్యవహరించిన జగన్ అండ్‌కో ని శిక్షించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ల రాక్షస పాలన సాగించారని మండి పడ్డారు. దేవతల రాజధాని అమరావతిని వైశ్యల రాజధానిగా అభివర్ణించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు మహిళల మనోభావాలను కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు. జగన్ తన బృందంతో కారుకూతలు కూయిస్తున్నారని ఎద్దేవ చేశారు. టీడీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కొందరు కుట్రలు పన్నుతున్నారన్నారు. పదకొండ సీట్లకే ప్రజలు పరిమితం చేసినా జగన్‌కి ఇంకా బుద్ధి రాలేదంటూ తనదైన శైలిలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ తీరు మారకుంటే నాలుకలు తెగకోస్తామంటూ హెచ్చరించారు. ఏపీపై విషం కక్కుతున్న సాక్షి పేపర్, టీవీలను బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, కార్పొరేటర్లు టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసి పోవడం ఖాయం



**కోవూరు, జూన్ 8 ప్రభాతవార్త :** అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని అవుతుంటే దానిని చూసి ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత మీడియా సాక్షిలో మహిళలను ఇంత ఘోరంగా అవమానించేలా చర్చావేదిక జరగడం, అటువంటి వారు కాల గర్భంలో కలిసిపోవడం ఖాయమని కోవూరు నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఓ మీడియా చానెల్‌లో అమరావతి రాజధానిపై విద్వేషంతో మహిళలను అవమానకర రీతిలో అసత్య ప్రచారం చేసేలా చర్చావేదిక జరగడం మరింత దారుణమన్నారు. అమరావతి ముమ్మాటికి దేవతల రాజధాని అని , భూములు త్యాగం చేసిన అమ్మల అమరావతి అని, జై అమరావతి అని నినాదాలు చేసిన శాంతమూర్తులు ఉన్న పవిత్ర భూమి మన రాజధాని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత ఛానెల్‌లో మహిళలను కించపరిచేలా అమరావతి ప్రాంతంలో ఎక్కువగా బ్రోతల్స్ ఉన్నారని వ్యాఖ్యానలు చేయడం ఎంతవరకు సబబన్నారు. మాజీ ముఖ్యమంత్రి సొంత ఛానెల్‌లో అమరావతి రాజధాని మహిళల పట్ల వారు చేసిన వ్యాఖ్యల పట్ల తాము తీవ్ర మనోవేధనకు గురయ్యామని, ఇటువంటి వ్యాఖ్యలు చేసిన ఆ వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని ఈ సందర్బంగా వారు డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో చేబ్రోల్ కిరణ్ అనే టీడీపీ కార్యకర్త మాజీ ముఖ్యమంత్రి సతీమణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అతనిని అరెస్టు చేసి జైలులో పెట్టడం జరిగిందన్నారు. కానీ శనివారం అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి గానీ, ఆ పత్రికా యాజమాన్యం కానీ ఏ విధమైన స్పందన లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలంతా ఓటు అనే ఆయుధంతో మిమ్మల్ని బెంగుళూరు ప్యాలెస్‌కే పరిమితం చేసినా ఆ ఛానెల్‌కు గానీ, మనుషులకు గానీ నేటికి బుద్ధి రాలేదన్నారు. మహిళల పట్ల ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హోమ్ మినిస్టర్ అనితలు వెంటనే చొరవ తీసుకోవాలన్నారు. మహిళలు సిగ్గు పడేలా ఇటువంటి వ్యాఖ్యలు చేసిన వారిని ఏం చేసినా పాపం లేదని మహిళలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళలను దారుణంగా అవమానిస్తూ ఆ చానెల్‌లో మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణమరాజులను వెంటనే అరెస్టు చేయాలని ఈ సందర్భంగా వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వేగూరు సర్పంచ్ కె. అమరావతి, మాజీ ఎంపీపీలు వెంకట రమణమ్మ, ఉమా, మాజీ సర్పంచ్‌లు చెంచమ్మ, వనమ్మ, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు కె. సుధాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు చెంబేటి పెంచలయ్య, గాదిరాజు సుధాకర్, వేమిరెడ్డి హరికుమార్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, డి. శ్రీనివాసులు నాయుడు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చక్రవర్తి, సాయిరెడ్డి, శ్రీనివాసులు, బెల్లకొండ విజయ్, కరేటి శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, నాగరాజు, కూటమి నేతలు అల్తాఫ్, పెద్ద సంఖ్యలో మహిళా నేతలు ఉన్నారు.

## సరస్వతీ అలంకారంలో శ్రీ ఆత్మారామస్వామి



**సంగం జూన్ 8 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ సీతాలక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆత్మరామస్వామి వారు సరస్వతీదేవి అలంకారంలో హంసవాహనంపైన భక్తులకు దర్శన మిచ్చారు. స్వామి వారిని రంగురంగుల పూలతో అలంకరించారు. అర్చకులు వేదగిరి సత్యనారాయణ, భరత్‌స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణా సంచాను కాల్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలు భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా కొండూరు దిరిశాలయ్య ( లేట్ ), మరియు వారి కుమారులు, కీర్తిశేషులు మామిళ్ళ శ్రీనివాసులు, మరియు వారి సోదరులు, చీపినాపి నరసయ్య అండ్ బ్రదర్స్, సబ్బు చలమయ్య అండ్ బ్రదర్స్, దేగల వెంకయ్య, పంది చెంచురామయ్య, వ్యవహారించారు. ఒంగోలుకు చెందిన జానపద కళాకారుల చే ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## భక్తిశ్రద్దలతో శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం



**వింజమూరు, జూన్ 8, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని జీబీకే ఆర్ఎస్‌టీ కాలనీ యందు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు పర్యవేక్షణలో ఈ ఆలయం నిర్మాణం సర్వాంగ సుందరంగా అయింది. నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా జరిగిన ఈ కార్యక్రమంలో మూడవ రోజు ఉదయాన్నే యంత్ర ప్రతిష్ఠ రత్నాన్యాసము లోహాన్యాసము గర్త పూజ విగ్రహ ప్రతిష్ఠ శిఖర ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం, శాంతి కళ్యాణం, పూర్ణాహుతి కార్యక్రమాలను జరిపించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు ముందుగా స్వామివార్లను జలాదివాసము, క్షీరాభివాసము పుష్పాది వాసము గణపతి శాంతి తదితర హోమములు జరిపించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రధానార్చకులు గంగాధర స్వామి సురేష్ స్వామి తేజ స్వామి శివరామకృష్ణ సునీల్ జనార్ధన స్వామి ఫణి స్వామీల ఆధ్వర్యంలో వేదమంత్ర ఉచ్చరణతో భక్తుల జై శ్రీరామ నినాదంతో స్వామి వారి యొక్క ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించారు. ఈ కార్యక్రమాలను మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు ఆధ్వర్యంలో ఎలాంటి లోపాలు లేకుండా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా కృషి చేశారు. కాలనీ భక్తులు స్వామి వారిపై అత్యంత భక్తి విశ్వాసంతో కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రతిష్ఠ అనంతరం సీతారాముల శాంతి కళ్యాణం జరిపించారు. ఈ కళ్యాణం సంస్థ లోకకళ్యాణం కోసమే జరుపబడిందని వేద పండితుల మాట కళ్యాణం జరిపించినట్లయితే ఆ గ్రామమే కాకుండా పరిసర గ్రామాల వాసులు కూడా శాంతి సౌభాగ్యాలతో వెలసిల్లుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసము.

## హంస వాహనంలో దర్శనమిచ్చిన శంకరుడు



**కోవూరు, జూన్ 8 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆదివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో హోమ పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు హంస వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆవుల సురేంద్రబాబు, మంజుల దంపతులు వ్యవహరించారు. అనంతరం స్వామివారు హంస వాహనంలో కోవూరు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి చేవూరి కృష్ణప్రసాద్, రుత్వికులు కృష్ణస్వామి, సుబ్బయ్య స్వామి, మురళి స్వామి, నిరంజన్ స్వామి, నిర్మాణ కర్తలు మొలకల శ్రీనివాసులురెడ్డి, పోలుదాసు హరి, గాదిరాజు చక్రవర్తి భక్తులు ఉన్నారు.

## కాకాణి పూజితని పరామర్శించిన ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు



**నెల్లూరు రూరల్, జూన్ 8, ప్రభాతవార్త :** నెల్లూరు డైకస్ రోడ్డులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాణి పూజితని ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ మంత్రి అనీల్ కుమార్ యాదవ్‌తో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా తలశిల రఘురామ్ పూజితతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. కాకాణి ఎలాంటి తప్పు చేయలేదని.. వారు న్యాయస్థానాల్లో తన నిర్దోషితత్వాన్ని నిరూపించుకొని.. ఈ కేసు నుంచి నిర్దోషిగా బయటకు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## నూరుభాషల విజయోత్సవ కార్యక్రమం త్వరలో గడగడపకు దూదేకుల కార్యక్రమము



**నెల్లూరు జూన్ 8 ప్రభాతవార్త :** నెల్లూరులోని హోటల్ శివమ్ ఇంటర్నేషనల్ నందు ఆదివారం నూరుభాషల విజయోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇటీవల టౌన్‌హాల్‌లో జరిగిన నూరుభాష విద్యార్థిని, విద్యార్థుల ప్రతిభాప్రోత్సాహక కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగినందున నెల్లూరు జిల్లా నూరుభాష సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్.సలీమ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన నూరుభాష పెద్దలకు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులను దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమెంటో అందచేయడం జరిగింది. ఈ సత్కారాలు ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ షేక్.మస్తాన్‌బాష చేతులమీదుగా సత్కరించడం జరిగింది. నూరుభాష విద్యార్థిని, విద్యార్థుల ప్రతిభ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్‌ని జిల్లా కమిటి ఘనంగా అభినందనలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్బంగా జిల్లా అధ్యక్షులు షేక్.సలీం మాట్లాడారు. త్వరలో గడపగడపకు దూదేకుల కార్యక్రమం జులై నుండి ప్రారంభమవుతుందని ప్రతిఒక్క దూదేకుల కుటుంబాలలో ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని తెలియచేశారు. అధికారుల సహకారంతో, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## విగ్రహప్రతిష్టాకార్యక్రమంలో ఎంపి



**మర్రిపాడు, జూన్8ప్రభాతవార్త :** జిల్లాలోని మర్రిపాడు మండలం చిన్నమాచనూరు పంచాయతీ మజరా నాగరాజుపాడులో ఆదివారం జరిగిన శ్రీ సీతారాముల విగ్రహప్రతిష్ఠా కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని విగ్రహాలను వీక్షించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దాంతోపాటు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో కూడా ఆయన పూజలు చేశారు. ఈరెండు దేవాలయాలను గ్రామంలో నూతనంగా నిర్మించి విగ్రహప్రతిష్ఠా ఉత్సవాలను నిర్వహించారు. ఈ శుభతరుణం ఎంతో ఆనందాన్ని కల్గించిందని, గ్రామస్థులంతా ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయాలను నిర్మించడం సంతోషదాయకమని వేమిరెడ్డి పేర్కొన్నారు. ఈ దేవాలయాలకు సంబంధించి తనవంతు సాయమందిస్తానని ఆయన గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఎంపిగా బాధ్యతలు చేపట్టాక ఈగ్రామాన్ని సందర్శించడంతో గ్రామస్థులంతా లమ అభిమానాన్ని చాటుకుంటూ పూలబాటలో ఆయనను నడిపించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరంగ ఆయన గ్రామసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన సమస్యలన్నింటిని రాష్ట్రదేవా దాయశా ఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి ఆనం అభివృద్ధి సాధించడంలో పట్టు సాధించారని, ఆయనకు ఎంతో అవగాహన కలిగి ఉందని, ఆయన ద్వారా ఈసమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మెన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, మండల తెలుగుదేశం అధ్యక్షుడు దేవరాల గంగాధర్‌యాదవ్, మాజీ మండల టిడిపి అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు శాఖమూరు నారాయణనాయుడు, భీమవరం సొసైటి మాజీ అధ్యక్షుడు యర్రమల్ల చిన్నారెడ్డి, గ్రామస్థులు జయచంద్ర, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

**నెల్లూరు క్రైమ్, జూన్ 8, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందిన సంఘటన వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. విడవలూరు గ్రామానికి చెందిన ఎం హనీష్ కార్తీక్ (17) ఐటిఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అప్రెంటిస్ నిమిత్తం అయ్యప్ప గుడి సమీపంలోని గుడ్ కాంప్లెక్స్‌లో ఓ కంపెనీలో గత నెల 17వ తేదీ నుండి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కంపెనీలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే అతని తల్లిదండ్రులు కార్తీక్ ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కార్తీక్ మృతి చెందాడు. కార్తీక్ తండ్రి వెంకటరమణయ్య ఫిర్యాదు మేరకు వేదయపాలెం సీఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టారు.